సాక్షి
అనంతపురం

సోమవారం, 7, ఆగస్టు, 2023



టమాట కిలో రూ.110

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.110 పలికింది. కనిష్టం రూ.75, సరాసరి రూ.90తో క్రయవిక్రయాలు జరిగాయి.



నిత్య విద్యార్థిగా ఉండాలి

తీర్పుల అధ్యయనంతో పాటు కొత్త విషయాలు తెలుసుకుంటే న్యాయవాదిగా రాణించవచ్చని జిల్లా జడ్జి శ్రీనివాస్ తెలిపారు. 8లో



జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

పీఏబీఆర్, ఎంపీఆర్‌లకు నీటి మళ్లింపు



మోపిడి లింక్ చానల్ వద్ద పీఏబీఆర్‌కు వెళుతున్న తుంగభద్ర జలాలు

ఉరవకొండ: హెచ్చెల్సీ ప్రధాన కాలువ నుంచి ఆదివారం పీఏబీఆర్, ఎంపీఆర్‌లకు వెయ్యి క్యూసెక్కుల నీరు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. మోపిడి వద్ద హెచ్చెల్సీ లింక్ చానల్ నుంచి పీఏబీఆర్ (పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కు 300 క్యూసెక్కులు, మిడ్‌పెన్నార్ డ్యాం(ఎంపీఆర్)కు 700 క్యూసెక్కుల నీరు వెళ్తోందన్నారు. నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని హెచ్చెల్సీ ఏఈ గోపాల్ నాయక్ తెలిపారు. సాగునీటికి ఇంకా అనుమతులు రాలేదని పేర్కొన్నారు.

టీబీ డ్యాంలో పెరుగుతున్న నీటి నిల్వ



తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ రోజురోజుకూ పెరుగుతోంది. ఆదివారం 85.184 టీఎంసీలకు చేరింది. డ్యాంలోకి 11,200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఆర్‌బీసీ, హెచ్చెల్సీ, పవర్ కెనాల్ తదితర కాలువలకు 5,941 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా.. ప్రస్తుతం 1,627.56 అడుగులకు చేరుకుంది. ఇక హెచ్చెల్సీలో ఆంధ్రా సరిహద్దు (105 కిలోమీటర్) వద్ద 1,586 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది.

క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సాంస్కృతిక రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ సాంస్కృతిక, క్రీడలు ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ వాణీ మోహన్ పేర్కొన్నారు. ఆదివారం బుక్కరాయసముద్రం సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం కింద గ్రామ సచివాలయాల పరిధిలోని ఉత్సాహవంతులైన యువతీ యువకులకు అక్టోబర్ ఒకటి నుంచి వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, షటిల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. ఈ క్రీడా పోటీలు సచివాలయ స్థాయి, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో 17 సంవత్సరాల వయస్సు కలిగిన అమ్మాయిలు, అబ్బాయిలు పాల్గొనాలన్నారు. సచివాలయ స్థాయిలో టీంలు ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి కేశవనాయుడు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంఈఓ లింగానాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సాధిక్ వలి, ఏపీఓ పోలేరయ్య, ఈసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ.. నాన్న.. ఓ చిన్నారి

సంతానలేమితో బాధపడుతున్న దంపతులు దత్తత కోసం పరితపిస్తున్నారు. అనాథ పిల్లలను తమ బిడ్డలుగా చేసుకునేందుకు క్యూ కడుతున్నారు. ఇందు కోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మనకు కనే అదృష్టం భగవంతుడు కల్పించలేదు.. కనీసం పెంచిన మమకారమైనా పొందుదాం అనే ఆలోచన వారిని ఇటువైపు రప్పిస్తోంది.

- పిల్లల దత్తత కోసం పలువురు క్యూ
- ఎక్కువ దరఖాస్తులు వచ్చిన జిల్లాల్లో 'అనంత'కు రెండో స్థానం
- అనాథ చిన్నారుల దత్తతతో తల్లిదండ్రులు కావాలనే ఆశ
- నిబంధనల ప్రకారమే శిశు గృహంలోని చిన్నారుల దత్తత



అనంతపురంలో కొన్ని నెలల క్రితం అమెరికా దంపతులు దత్తత తీసుకున్న చిన్నారి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పిల్లలు లేని దంపతులకు ఆ లోటు ఉండకూడదనే ఉద్దేశంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ దత్తత ప్రక్రియను ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక విభాగం కూడా ఉంది. ప్రతి జిల్లా కేంద్రంలో శిశు గృహాలను ఏర్పాటు చేసింది. అనాథలు, ఆదరణకు నోచుకోని పిల్లలను శిశుగృహలో సంరక్షిస్తుంటారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు ఆ లోటును పూడ్చేందుకు, అనాథ పిల్లలకు తల్లిదండ్రులు లేని లోటును తీర్చేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ పని చేస్తోంది. 15 ఏళ్లలోపు బాలబాలికలు దత్తతకు అర్హులు. దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు వారి అర్హత ఆధారంగా పిల్లలను ఇస్తారు.

దత్తత కోసం దరఖాస్తుల వెల్లువ..

రాష్ట్రంలో చిన్నారులను దత్తత చేసుకోవాలని వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా విశాఖ, ఆ తర్వాతి స్థానం ఉమ్మడి అనంతపురం జిల్లాదే. గడిచిన ఏడాది 172 మంది దంపతులు చిన్నారుల కోసం దత్తతకు వచ్చారు. వీరిలో 21 మందికి మాత్రమే దత్తత అవకాశం దక్కింది. మిగతా 151 దరఖాస్తులు వెయిటింగ్‌లో ఉన్నాయి. అనంతపురం జిల్లాకు వచ్చిన దరఖాస్తుల్లో ఇతర దేశాల వారూ ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,184 దరఖాస్తులు వెయిటింగ్‌లో ఉండగా అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే 151 ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి..

ఒక చిన్నారిని దత్తత చేసుకోవాలంటే వివిధ దశల్లో దరఖాస్తు ప్రక్రియ ఉంటుంది. ఈ మొత్తం వ్యవహారం తీతీతీ.ఛిౌ. ఎజీఛి.జీ ఎ వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తును పైన పేర్కొన్న వెబ్‌సైట్‌కు రూ.6వేలు డీడీ సమర్పించి అప్‌లోడ్ చేయాలి. అనంతరం దత్తత ఏజెన్సీ వారు అధ్యయనం చేసి నివేదికను వెబ్‌సైట్‌లో పెడతారు. దత్తతకు దరఖాస్తు చేసుకున్న వారి మొబైల్‌కు సమాచారం వస్తుంది. ఈ సమాచారం మేరకు 48 గంటల్లో బిడ్డ నచ్చితే రిజర్వు చేసుకోవచ్చు. రిజర్వు చేసుకున్న బిడ్డను నచ్చిందని ఆమోదం తెలియజేసి, రూ.40 వేలు డీడీ సమర్పించి బిడ్డను పొందాలి. బిడ్డను పొందిన వారం రోజుల్లో పాన్‌కార్డు, ఆదాయ ధ్రువపత్రం, వయసు ధ్రువీకరణ, దంపతుల ఫొటో, నివాస ధ్రువపత్రం, వివాహ ధ్రువపత్రం, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు ఏజెన్సీకి ఇవ్వాలి. బిడ్డను పొందిన వారం రోజుల్లో ఈ ధ్రువపత్రాలన్నీ స్థానిక కుటుంబ న్యాయస్థానం /జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో సమర్పిస్తే ఉత్తర్వులిస్తారు. బిడ్డను దత్తత తీసుకున్నాక దత్తత ఇచ్చిన సంస్థకు సంబంధించిన సోషల్ వర్కర్ బిడ్డ యోగ క్షేమాల పరిశీలన రెండేళ్లపాటు చూస్తారు. ఈ సమయంలో 4 దఫాలు ఒక్కోసారి రూ.2వేల చొప్పున దత్తత తీసుకున్న దంపతులు డీడీ రూపంలో సొమ్ము చెల్లించాలి.

గడిచిన ఏడాది దత్తత కోసం వచ్చిన దరఖాస్తులు...		
ఉమ్మడి జిల్లా	వచ్చిన దరఖాస్తులు	వెయిటింగ్‌లో ఉన్నవి
చిత్తూరు	82	80
వైఎస్సార్	24	24
కర్నూలు	34	31
అనంతపురం	172	151
నెల్లూరు	129	111

నిబంధనల ప్రకారం దత్తత

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని దత్తత సంస్థ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ(కారా) నిబంధనల మేరకు దత్తతకు వచ్చే దంపతుల పూర్వాపరాలను పరిశీలించాకే దత్తత ఇస్తున్నాం. ఈ ఏడాది ముగ్గురి దత్తత ప్రక్రియ జరుగుతోంది. ప్రస్తుతం అనంతపురం శిశు గృహలో ఐదుగురు చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారు.

– శ్రీదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్

రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న డైరెక్టర్ కె.బేరా

బుక్కరాయసముద్రం: రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేపట్టాలని జాతీయ వేరుశనగ పరిశోధన సంస్థ (జునాగఢ్, గుజరాత్) దక్షిణ ప్రాంత డైరెక్టర్ డాక్టర్ కె.బేరా శాస్త్రవేత్తలకు సూచించారు. ఆదివారం రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానాన్ని ఆయన సందర్శించారు. ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ కె.బేరా మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం వలన అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. బెట్ట పరిస్థితులు తట్టుకునే విత్తనాలు లేకపోవడం వల్లజిల్లాలో వేరుశనగ సాగు తగ్గిపోయిందన్నారు. వేరుశనగ లాభదాయకంగా ఉండాలంటే పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, యాంత్రీకరణ చేపట్టాలని సూచించారు. జిల్లా నుంచి ఔత్సాహిక రైతు బృందం జాతీయ వేరుశనగ పరిశోధన సంస్థ (జునాగఢ్, గుజరాత్)ను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాధిక, శాస్త్రవేత్తలు నటరాజ్, వెంకటరమణ, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సహజ దేవా, డాక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

శింగనమల: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం జిల్లాకు వస్తున్నారు. ఉదయం 8 గంటలకు బుక్కరాయసముద్రం జెడ్పీ హైస్కూల్, 8.30కు ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, 9.45 గంటలకు వెంకటాపురం చౌకధాన్యపు డిపో, ఎండీయూ వాహనం, 10.45కు వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేస్తారు. తర్వాత 11.45కు నార్పలలోని ఉయ్యాలకుంట అంగన్‌వాడీ కేంద్రం-2, సుల్తాన్ పేట అంగన్‌వాడీ సెంటర్-2, 12.30కు ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్, 1 గంటకు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నియోజకవర్గస్థాయి అధికారులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు శింగనమలలోని బీసీ బాలుర వసతి గృహం, 4.30 గంటలకు కేజీబీవీ, 5 గంటలకు ఎస్సీ బాలుర వసతి గృహం, 5.30కు హెల్త్ సెంటర్, 6.30కు బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్దనున్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ చేస్తారు. మంగళవారం ఉదయం 8 గంటలకు గార్లదిన్నె కేజీబీవీ, 9కి ఆదర్శ పాఠశాల తనిఖీ చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఎయిర్‌పైపు పేలి.. డ్రైవర్ మృతి



మృతుడు వెంకటేష్

బొమ్మనహాళ్: హరేసముద్రం గ్రామ శివారులోని శాతవాహన (జిందాల్) కర్మాగారంలో నంద్యాల జిల్లా డోన్ మండలం చింతలపేట గ్రామానికి చెందిన వెంకటేష్ (43) అనే డ్రైవర్ ప్రమాదవశాత్తు ఎయిర్‌పైపు పేలి లైమ్‌స్టోన్ పౌడర్ మీదపడటంతో మృతి చెందాడు. బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ తెలిపిన వివరాల మేరకు.. కర్మాగారంలో పైపుల తయారీ కోసం వెంకటేష్ ఆదివారం ఉదయం ఏపీ 39 యూజీ 0517 అనే ట్యాంకర్ లారీలో లైమ్‌స్టోన్ పౌడర్ తెచ్చాడు. రాత్రి 8 గంటల తర్వాత పౌడర్‌ను అన్‌లోడ్ చేస్తుండగా ఎయిర్ పైపు పేలింది. లైమ్‌స్టోన్ పౌడర్ డ్రైవర్ వెంకటేష్ మీద పడటంతో అతను కుప్పకూలిపోయాడు. కార్మికులు గమనించి అతడిని వెంటనే బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే వెంకటేష్ మృతి చెందాడు.

చంద్రబాబుపై రాజద్రోహం కేసు పెట్టాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా డిమాండ్



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా టీడీపీ శ్రేణులను రెచ్చగొడుతున్న చంద్రబాబుపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో చంద్రబాబు రాజకీయ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఘోర పరాభావం తప్పదని స్పష్టం చేశారు. టీడీపీలోని అరాచకశక్తులతో పోలీసులపై దాడికి పాల్పడేలా ప్రోత్సహించారన్నారు. ముందస్తు స్కెచ్‌లో భాగంగానే టీడీపీ నాయకులు పుంగనూరులో భయానక వాతావరణం సృష్టించారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధాటికి పుంగనూరులో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. సీఎం, మంత్రికి వస్తున్న ఆదరణ ఓర్వలేక వ్యక్తిగత విమర్శలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు, లోకేష్ సభలు, సమావేశాల్లో కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలతో దాడులకు ఉసిగొల్పి రణరంగంగా మార్చేందుకు కుట్ర పన్నారన్నారు. లోకేష్ అయితే ఏకంగా 20 కన్నా ఎక్కువ క్రిమినల్ కేసులు పెట్టించుకుంటే నామినేటెడ్ పోస్టు ఇస్తామని యువతకు సందేశమిస్తున్నారన్నారు. అధికారం కోసం టీడీపీ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని, ప్రజలు అన్నీ నిశితంగా గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణ

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సవరణ ప్రక్రియలో వలంటీర్లు పాల్గొనకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ అంశంపై కలెక్టర్ ఆదివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో డీఆర్‌ఓ గాయత్రీదేవితో కలిసి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌ఓ), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారు (ఏఈఆర్‌ఓ)లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సవరణలో భాగంగా బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలిస్తూ ఉండాలన్నారు. సర్వేలో రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొనేలా ఆయా పార్టీలకు సూచించాలన్నారు.


జాగ్రత్తగా పరిశీలించాలి..

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు నమోదు, తొలగింపులను ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు జాగ్రత్తగా పరిశీలించిన తరువాతనే ఆమోదించాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటరు మరణించి ఉంటే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత తొలగించాలని చెప్పారు. ఒకే ఇంటి నంబరుపై అధిక సంఖ్యలో ఓటర్లు ఉంటే ఆ ఇంటిని పరిశీలించాలన్నారు. ఆ ఇంటి నంబరు మీద ఎక్కువ పోర్షన్లు ఉంటే ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరక వారికి నోషనల్ ఇంటి నంబరు ఇవ్వాలని సూచించారు. నియోజవర్గాల పరిధిలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ కనకరాజు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఈడీటీలు, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

'స్కాలర్‌షిప్'కు బయోమెట్రిక్ తప్పనిసరి

అనంతపురం సిటీ: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాల మంజూరుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్ల బయోమెట్రిక్ అథెంటికేషన్ తప్పనిసరిగా నమోదు చేయాలని ఉమ్మడి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ రఫీ ఓ ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ అథెంటికేషన్ నమోదు చేయకపోతే విద్యార్థుల ఖాతాల్లో ఉపకార వేతనాలు జమకావని పేర్కొన్నారు. అనంతపురం పెన్నార్ భవన్‌లోని సీపీఓ మీటింగ్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల్లోపు నమోదు చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అనంతపురం, రాప్తాడు, శింగనమల, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాల్లోని పాఠశాల, కళాశాలల హెచ్‌ఓడీలు నేషనల్ స్కాలర్‌షిప్ ఎన్‌ఎస్‌పీ యూజర్ ఐడీ తీసుకుని ఆధార్ అథెంటికేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల శ్రీనివాస డిగ్రీ కళాశాలలో (ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలు), హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల వారు హిందూపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అజీజియా మునిసపల్ ఉర్దూ హైస్కూల్‌లో, కదిరి, నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట, తలుపుల, ఎన్‌పీ కుంటకు సంబంధించిన వారు కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు.

19న పంచాయతీ ఉప ఎన్నికలు



అనంతపురం రూరల్: జిల్లాలోని పలు పంచాయతీల్లో వివిధ కారణాలతో ఖాళీలు ఏర్పడిన సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు ఈ నెల 19న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. యల్లనూరు మండలం జంగంపల్లి, పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడు పంచాయతీ సర్పంచ్ స్థానాలతో పాటు 34 పంచాయతీల్లోని 33 వార్డు మెంబర్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 8 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 12న అప్పీళ్లు, 13న డిస్పోజల్, 14న మధ్యాహ్నం మూడు గంటలకు వరకు ఉపసంహరణ, మధ్యాహ్నం 3పైన పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుంది. 19వ తేదీ ఉదయం 7 నుంచి 1 గంట వరకు పోలింగ్, అదే రోజు విజేతల వివరాలు ప్రకటించనున్నారు. అనివార్య కారణాల వల్ల పోలింగ్ నిలిచిపోతే ఈ నెల 20 రీపోలింగ్ నిర్వహించి, అదే రోజు గెలుపొందిన అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా విత్తన కిట్లు
- జిల్లాలో 915 మంది ఎస్సీ రైతుల ఎంపిక
- 2,368 ఎకరాల్లో ప్రకృతి సేద్యం

కళ్యాణదుర్గం: వ్యవసాయంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం మితిమీరడంతో మనం తినే ఆహారం విషతుల్యంగా మారుతోంది. దీంతో అనేక ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయి. దీన్ని రసాయనాలతో నిమిత్తం లేని ప్రకృతి వ్యవసాయంతోనే అధిగమించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ముఖ్యంగా షెడ్యూల్డు కులాల (ఎస్సీ) రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వంద శాతం రాయితీతో విత్తనాలను అందజేస్తూ సేంద్రియ సాగువైపు ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగానే ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) కింద సేంద్రియ పద్ధతులలో వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టాయి. మారుతున్న జీవన విధానంతో రసాయన ఎరువుల వినియోగంతో పండించిన పంటలకు స్వస్తి పలికి, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా చర్యలు చేపట్టాయి.



మల్లాపురంలో సేంద్రియ పద్ధతులలో రైతు నారాయణప్ప సాగు చేసిన కూరగాయల పంటలు

915 మంది రైతుల ఎంపిక..

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు ఆసక్తి ఉన్న ఎస్సీ రైతులను అధికారులు గుర్తించారు. ఎంపిక చేసిన ఒక్కో రైతుకు రూ.10 వేలు విలువ చేసే వివిధ రకాల పంటలు, కూరగాయల విత్తనాలు, పరికరాలతో కూడిన కిట్లను అందిస్తున్నారు. జిల్లాలో 915 మంది రైతులను ఎంపిక చేసి వారి ద్వారా 2,368.18 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సేంద్రియ పద్ధతుల్లో వేరుశనగ, పత్తి, కంది, కూరగాయలు పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కిట్లలో ఏముంటాయంటే....

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వంద శాతం రాయితీపై అందించే కిట్లలో కందులు, పెసలు, వేరుశనగ, రాగులు, కొర్రలు, సజ్జలు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, పెసలు, శనగ విత్తనాలుంటాయి. వీటితో పాటు కిచెన్ గార్డెన్ కూరగాయల కిట్లు రెండు, ఇందుకు సంబంధించి 100 లీటర్ల డ్రమ్ములు రెండు, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, టార్పాలిన్ ఒకటి, పసుపు జిగట అట్టలు 30, లింగార్షక బుట్టలు 8 చొప్పున అందిస్తున్నారు.

- ప్రకృతి వ్యవసాయానికి ద్రవ జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రియ ఎరువులు, బీజామృతం వంటి విత్తన శుద్ధి రసాయనం, నీమాస్త్రం, అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కీటక నాశనులు తయారు చేసుకోవాలి.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రకృతి వ్యవసాయం ఇలా..		
నియోజకవర్గం	ఎంపిక చేసిన రైతుల సంఖ్య	సాగు లక్ష్యం (ఎకరాలలో)
గుంతకల్లు	77	168.45
కళ్యాణదుర్గం	91	231.59
రాప్తాడు	204	660.45
రాయదుర్గం	167	386.89
శింగనమల	140	268.12
తాడిపత్రి	92	217.43
ఉరవకొండ	144	435.25
మొత్తం	915	2368.18

ఆదాయం ఎక్కువ



నాకు 4.30 ఎకరాల పొలం ఉంది. ఇందులో రెండు ఎకరాల విస్తీర్ణంలో అనప సాగు చేశాను. జెడ్‌బీఎన్‌ఎఫ్ (జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్) ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ప్రస్తుతానికి రూ.50వేల ఆదాయం వచ్చింది. ఇంకా రూ.75వేల దాకా వచ్చే అవకాశం ఉంది.

– వన్నూరమ్మ, సేంద్రియ వ్యవసాయ రైతు, దురదకుంట

ఆరోగ్యానికి ఎంతో మేలు



సేంద్రియ పద్ధతుల్లో చేసే ప్రకృతి వ్యవసాయ పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు. నేను కూడా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. 3.32 ఎకరాల పొలం ఉంది. ఇందులో అన్ని రకాల కూరగాయలు సాగు చేస్తున్నా. పంట దిగుబడులు బాగానే వస్తున్నాయి.

– బాబు, రైతు, నిజవల్లి

సేంద్రియ సాగుకు ప్రోత్సాహం



వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాయి. ఎంపిక చేసిన ఎస్సీ రైతులకు పూర్తిగా వంద శాతం రాయితీతో పలు రకాల విత్తనాలు ఇస్తున్నాం. కూరగాయలను పండించేందుకు సైతం పరికరాలను ఉచితంగా అందజేస్తున్నాం.

– సారయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్సీ కార్పొరేషన్, అనంతపురం

క్లుప్తంగా

టీడీపీ వర్గీయులపై కేసు నమోదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడికి పాల్పడిన 11 మంది టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి ఆదివారం తెలిపారు. శనివారం సాయంత్రం చిక్కేపల్లి సమీపంలో బోయరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ వర్గీయులు వెంకటశివ, మారుతి, మంజునాథ, రాజు, నగేష్‌పై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత లక్ష్మీనారాయణ, హరికృష్ణ, నగేష్, పెద్దయ్య, శివ, శ్రీరాములు, రామకృష్ణ, నడిపి కొత్తరాయుడు, శ్రీనివాసులు, ఓబన్నగారి రామకృష్ణ, చిన్న ఓబులేసు కట్టెలతో దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. బాధితులతో కలసి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాప్తాడురూరల్: ఏపీ పీఈటీ, ఎస్‌ఏపీఈ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం అనంతపురం కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా నంద్యాల, కర్నూలు, నెల్లూరు జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య, వెంకటేశులు, రవికుమార్, తిరుపతయ్య హాజరయ్యారు. వీరి సమక్షంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా ఆర్సీ అక్కులప్ప, కార్యదర్శిగా పి.సత్యనారాయణ, కోశాధికారిగా ఈ. శివకేశవులు, మహిళా కార్యదర్శులుగా నాగమణి, సరితను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు కుమార్ రాజా, మొరార్జీ పాల్గొన్నారు.

రిమాండ్‌కు నిందితుడు

పామిడి: మండలంలోని కండ్లపల్లి నివాసి దళిత నల్లప్పను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు సీఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. గత శుక్రవారం మద్యం తాగేందుకు భార్య బజారక్క డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో భార్యాపిల్లలను హతమార్చేందుకు అదే రోజు అర్ధరాత్రి తాను నివాసముంటున్న కొట్టానికి నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం ఉదయం పామిడిలోని ఎద్దులపల్లి రోడ్డు రైల్వే గేట్ సమీపంలో తచ్చాడుతున్న నల్లప్పను గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అనంత సిగలో.. అందాల జలపాతాలు



కోన రామలింగేశ్వర ఆలయం ఎదుట ఉన్న జలపాతం



కొండల నడుమ కనిపిస్తున్న కోన చెరువు



మారదమ్మ జలపాతం

వర్షాకాలంలో అనంతపురం జిల్లా ఆనందతీరంగా మారిపోతుంది. జలపాతపు సవ్వడులతో కళకళలాడుతుంది. ఎత్తైన కొండల నుంచి దూకే నీటి సవ్వడులు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. 2019 తర్వాత నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా యాడికి మండలం కోనరామలింగేశ్వరుడి క్షేత్రంలోని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి.

- కోన రామలింగేశ్వరుడి చెంత ప్రకృతి పరవశం
- భారీగా తరలివస్తున్న పర్యాటకులు

యాడికి: పర్యాటకుల స్వర్గధామంగా కోన క్షేత్రం విరాజిల్లుతోంది. ప్రకృతి అందాలకు నిలయమై వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది యాడికి మండలంలోని కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రం. ఈ క్షేత్ర పాలకుడిగా రామలింగేశ్వరుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. స్వయంగా శ్రీరాముడే ఇక్కడ లింగాన్ని ప్రతిష్ఠించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. మహా శివరాత్రికి భారీ సంఖ్యలో భక్తులు వస్తారు. మూడు రోజుల పాటు తిరునాల జరుగుతుంది.

రెండు జలపాతాల్లో ఎడతెగని నీటి సవ్వడులు..

యాడికి నుంచి 13 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో కొండల మధ్యన వెలసిన కోన రామలింగేశ్వరుడి ఆలయం ప్రకృతి అందాలకు నెలవుగా మారింది. ఆలయం ఎదుట ఉన్న జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దాదాపు 200 అడుగుల ఎత్తున ఉన్న కొండపై నుంచి పాలధారలా నీరు కిందకు జాలువారుతుంటే చూసేందుకు రెండు కన్నులు కూడా చాలవని పర్యాటకులు అంటుంటారు. అలాగే ఆలయం వెనుక అర కిలోమీటర్ దూరంలో వంద అడుగుల ఎత్తు నుంచి దూకే మరో జలపాతం ఉంది. మారదమ్మ గుడి వద్ద జలజలపారే పాల నురుగులాంటి జలపాతం దర్శనమిస్తోంది. కోనరామలింగేశ్వర ఆలయం వెనుక దాదాపు వంద మీటర్ల దూరంలో ఎకరా విస్తీర్ణంలో విస్తరించిన వందల ఏళ్ల నాటి మర్రి చెట్టు ఉంది. ఈ మహావృక్షానికి దక్షిణాన 20 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు సదా నిండుకుండను తలపిస్తుంటుంది. కార్తీక మాసంలో ఈ మహావృక్షం వద్ద వనభోజనానికి వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు.



నీటి గుండంలో సందడి చేస్తున్న పర్యాటకులు

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడ స్వచ్ఛమైన గాలిని పీల్చడం ద్వారా ఎన్నో రుగ్మతలు దూరమవుతాయి. దీంతో చాలా మంది పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. కోన క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో బాగుంటుంది.

– కోనా వెంకటశివారెడ్డి, కోనుప్పలపాడు

పెన్నహోబిలంలో కనువిందు



ఎంపీఆర్‌కు పరుగులు తీస్తున్న తుంగభద్ర జలాలు

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో జలపాతం కనువిందు చేస్తోంది. కొన్ని రోజులుగా హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర జల సవ్వడులతో పెన్నహోబిలంలో ఆహ్లాద వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పర్యాటకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సందడి చేస్తున్నారు.



పెన్నహోబిలంలో ఆకట్టుకుంటున్న జలపాతం

మంత్రి పెద్దిరెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: ఏపీ రాజకీయ చరిత్రలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి ఉన్న గౌరవం ఏమిటో తెలుసుకోకుండా ఆయనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని టీడీపీ నాయకులను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఉరవకొండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పుంగనూరులో అలజడులకు వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కేవలం పోలీసులనే లక్ష్యంగా చేసుకుని ఈ దాడులను ముందుండే చంద్రబాబు ప్రేరేపించారన్నారు. టీడీపీ రౌడీ మూకల దాడిలో అనేకమంది పోలీసులు గాయపడ్డారన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా కేవలం విధ్వంసం సృష్టించేందుకే పుంగనూరులో చంద్రబాబు రోడ్‌షో చేపట్టారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఒక్కరు కూడా ఘటనా స్థలంలో లేరని, ఒకవేళా వారే కనుక ఉన్నట్లైతే టీడీపీ అనుకూల మీడియా విస్తృత ప్రచారం సాగించేదన్నారు. అయితే ఈ సంఘటనను మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి ఆపాదిస్తూ ఆరోపణలు చేస్తుండం సిగ్గు చేటన్నారు. మరోసారి పెద్దిరెడ్డి కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే న్యాయవాద వృత్తిలో రాణింపు

- జిల్లా జడ్జి జి.శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: న్యాయవాదులు నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే వృత్తిలో రాణింపు ఉంటుందని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జి.శ్రీనివాస్ అన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జిల్లా ద్వితీయ మహాసభ ఆదివారం అనంతపురంలోని విజయనగర 'లా' కళాశాలలో నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సీతారామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా జడ్జి శ్రీనివాస్, గౌరవ అతిథులుగా ఆల్ ఇండియా బార్‌కౌన్సిల్ సభ్యుడు రామిరెడ్డి, ఏఐఎల్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. 'ది స్పెసిఫిక్ రిలీఫ్ యాక్ట్ రూల్స్ రెగ్యులేషన్స్'పై అవగాహన కల్పించారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వారు ఎప్పటికప్పుడు వెలువడుతున్న తీర్పులను పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయనగర లా కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రాచారి, సీనియర్ న్యాయవాదులు హరినాథరెడ్డి, విజయ్‌కుమార్, బార్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ వెంకట రాముడు, రంగ నాయకులు, సీపీ గౌడ సుదర్శన్, ధరమ్‌సింగ్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ఉరవకొండ'పై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం

- నియోజకవర్గ సమావేశంలో పార్టీ పరిశీలకుడు శ్రీనివాసులు



మాట్లాడుతున్న శ్రీనివాసులు (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, తదితరులు

ఉరవకొండ: రాబోవు ఎన్నికల్లో ఉరవకొండ నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, చిన్నపాటి విభేదాలు పక్కన పెట్టి పార్టీ విజయం కోసం సైనికుల్లా ఉద్యమించాలని ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ పరిశీలకుడు, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అనంతపురంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఉరవకొండ నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉరవకొండ నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయి నుంచి ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. టీడీపీ నాయకుల తప్పుడు ఆరోపణలు తిప్పికొడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచిని విస్తృత ప్రచారం చేయాలన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు ఎవరైనా చేపడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ.. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా 2024లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఏర్పాటును అడ్డుకోలేరన్నారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. అల్లర్లు, అలజడిలు సృష్టించి సీఎం కావాలని చంద్రబాబు చూస్తున్నాడని, ఇందుకు పుంగనూరు ఘటననే నిదర్శమని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జగన్ ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. జగనన్న సురక్ష ద్వారా 19,754 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖరరెడ్డి, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఐదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు.

వివాహిత ఆత్మహత్య

శింగనమల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ చితంబరయ్య తెలిపిన మేరకు.. శింగనమల మండలం ఉల్లికంటిపల్లికి చెందిన జూటూరు అశ్విని (24)కి పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లికి చెందిన బయపరెడ్డితో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి బానిసగా మారిన బయపరెడ్డి పనీపాట చేయకుండా జులాయిగా మారాడు. దీంతో కుటుంబపోషణ భారం కావడంతో పిల్లలను పిలుచుకుని పుట్టింటికి అశ్విని చేరుకుంది. అయినా భర్తలో మార్పు రాకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం క్రిమిసంహారక మందు తాగింది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్విమ్మర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

అనంతపురం: జిల్లా స్విమ్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎనుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.రాజశేఖర్, జిల్లా చీఫ్ కోచ్ పి.నరసింహారెడ్డి వ్యవహరించారు. జిల్లా స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.రవిశేఖరరెడ్డి, కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్, కోశాధికారిగా కేవీ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జీఎస్ విక్రమ్, వి.వెంకటరెడ్డి, సి.రవీంద్రనాథ్, లోకేశ్వరరెడ్డి, సహ కార్యదర్శులుగా టి.మధుమతి, ఎస్.శైలజ, రంగనాథరెడ్డి, కె.భగవతి ఎన్నికయ్యారు.

మణిపూర్‌లో మతపరమైన హింస ఆపండి

- శాంతి ర్యాలీలో క్రైస్తవ మతబోధకులు



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అనంతపురం కల్చరల్: మణిపూర్‌లో నెలల తరబడి సాగుతున్న మతపరమైన హింస దేశ ప్రగతికి మంచిది కాదని చర్చి పాస్టర్లు అన్నారు. వెంటనే మణిపూర్‌లో శాంతిభద్రతలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతపరమైన హింసను నిరసిస్తూ ఐక్య క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అనంతపురంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. అరవిందనగర్‌లోని సీఎస్‌ఐ చర్చి వద్ద ర్యాలీని ప్రత్యేక ప్రార్థనలతో పాస్టర్ బెన్‌హర్‌బాబు ప్రారంభించారు. ఆయనతో పాటు ఎస్‌ఐయూ చర్చి సంఘకాపరి రెవరెండ్ సంపత్‌కుమార్, పాస్టర్ మోజెస్ అనిల్‌కుమార్, జాన్‌వెస్లీ తదితరులు మాట్లాడారు. అంతకు ముందు అల్లర్లలో మృతి చెందిన వారి కోసం, వారి కుటుంబాల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఐ నిర్వాహకులు జాన్‌సుధీర్, దేవరాజ్, పాస్టర్ ఐజయ్య, జోసఫ్, పాస్టర్ మనుష్యే పాల్గొన్నారు.

హోరాహోరీగా సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్ తైక్వాండ్ పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు ఎస్.గురుస్వామి అధ్యక్షతన జరిగిన ఈ పోటీలకు 100 మంది క్రీడాకారులు హాజరు కాగా, ప్రథమ స్థానంలో నిలిచిన వారిని కర్నూలు జరిగే 37వ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తైక్వాండో కోచ్‌లు తులసి, రామాంజి, కేశవ, భరద్వాజ్, ప్రదీప్ పాల్గొన్నారు.

చాబాలతో గద్దర్‌కు అనుబంధం



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న చాబాల వాసులు

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంతో ప్రజాగాయకుడు గద్దర్‌కు విడదీయరాని బంధముంది. చాబాలకు చెందిన బండయ్య మాస్టర్ అలియాస్ మహదేవ్ నక్సలైట్ ఉద్యమంలో కీలకంగా ఉన్న 1990లో జననాట్య మండలి శిక్షణా తరగతులు చాబాలలో నిర్వహించారు. ఆ సమయంలో శిక్షణ తరగతులకు నేతృత్వం వహించిన గద్దర్ దాదాపు 40 రోజుల పాటు ఆ గ్రామంలోనే ఉండిపోయారు. ఆ సమయంలోనే గ్రామస్తులతో విడదీయరాని ఆత్మీయ బంధాన్ని ఆయన ఏర్పరుచుకున్నారు. గద్దర్ మృతిచెందినట్లు తెలియగానే చాబాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం రాత్రి గద్దర్‌కు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గద్దర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. కుజదోష, సర్పదోషం ఉన్న వారికి ఆలయ ప్రాంగణంలో దోష నివారణ పూజలు హోమాలు, రాహుకేతు హోమాలు నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి అమ్మవారికి పూజలు, మహా మంగళహారతి ఇచ్చారు.

వీధి వ్యాపారులకు రుణాలు



పీఎం స్వానిధికి దరఖాస్తు చేసుకునేందుకు బారులుతీరిన చిరు వ్యాపారులు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్న వీధి వ్యాపారులకు రుణాలు అందించేందుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. పీఎం స్వానిధి కార్యక్రమం ద్వారా వీధి వ్యాపారులకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు బ్యాంకులు రుణం అందించనుంది. దాదాపుగా 3వేల మంది రిజిస్ట్రేషన్ చేయించేందుకు మెప్మా విభాగంలోని కమ్యూనిటీ ఆర్గనైజర్లు వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. వీధి వ్యాపారులు తమ అకౌంట్, ఆధార్ నంబర్, రేషన్ కార్డు జిరాక్స్‌లతో నగరపాలక సంస్థలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే నేరుగా వారి ఖాతాల్లోనే రుణం జమ అవుతుందని మెప్మా పీడీ విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వీధి వ్యాపారులు 12 నెలల కాల వ్యవధిలో రుణం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం



కేక్‌కట్ చేస్తున్న ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచి ఆవరణలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆఫీసర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆర్డీటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం రూరల్ మండలం కాటికానికాలువలోని ఆశ్రయ అనాథాశ్రమానికి బియ్యం, బేడలు, వంటనూనె, నిత్యావసర సరుకులు వితరణ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు చంద్రమోహన్, నరేంద్రరెడ్డి, మెయిన్‌బ్రాంచ్ ఏజీఎం కోటిరెడ్డి, చీఫ్ మేనేజర్ నగినాబాను, వేణుగోపాల్, చంద్రశేఖర్, నటరాజ్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేసి కానుకలు అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఎస్ఎస్ ప్యారడైజ్ సమావేశ మందిరంలో అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ అనంత మాలతి ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అన్ని బంధాల కంటే స్నేహ బంధం ఎంతో విలువైనదని, మంచి స్నేహితులు ఒక్కరున్నా జీవితానికి ఎంతో భరోసా ఉంటుందన్నారు. తన కష్టసుఖాలలో పాలుపంచుకునే స్నేహానికి మించిన ఆత్మస్థైర్యం మరేది నింపలేదన్నారు. స్నేహితులిచ్చి ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలనధిరోహించిన వారెందరో ఉన్నారని గుర్తు చేశారు. అవోపా అధ్యక్షురాలు అనురాధ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

రామగిరి: నాయీ బ్రాహ్మణులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు ఆదివారం డిమాండ్ చేశారు. ఓ టీవీషోలో జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంగలోడా అని సంబోధించి నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. నాయీ బ్రాహ్మణులను కించపరచకుండా ప్రభుత్వం జీవో 50 విడుదల చేసిందన్నారు. అయినా అహంకారంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇలా మాట్లాడడం సరికాదన్నారు.

దివ్యమైన అభినయం

- ఎల్లలు దాటిన అనంత నృత్యకారిణి కీర్తి
- ఎన్‌వైకే యువజనోత్సవాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆమె అభినయం సమ్మోహనం.. అందెలు కట్టి లయ బద్ధంగా చేసే నృత్యం అద్భుతం.. కూచిపూడి అయినా, భరత నాట్యమైనా.. కళ్లతో హావభావాలు పలికిస్తుంది.. అలవోకగా నాట్యమాడుతూ చూపరులను మైమరిపిస్తుంది. చిన్ననాటి నుంచి ఇటు చదువుతోపాటు అటు శాస్త్రీయ నృత్యంపై మమకారం ఎక్కువ. తనదైన ప్రతిభతో రాణిస్తూ అనేక అవార్డులు సాధిస్తూ అనంత కీర్తిని ఎల్లలు దాటించింది నగరానికి చెందిన నృత్యకారిణి దివ్యశ్రీ. ఈనెల 13న గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి నృత్యపోటీలకు ఎంపికైంది.

– అనంతపురం కల్చరల్:



జిల్లా స్థాయికి ఎంపికైన మహిషాసుర మర్దిని నృత్యరూపకం (ఫైల్)

నగరానికి చెందిన నారాయణస్వామి, లక్ష్మీ దంపతుల కుమార్తె దివ్యశ్రీ బీఎస్సీ, బీఎడ్ పూర్తి చేసింది. అనంతరం ఎంఏ డ్యాన్సు, కూచిపూడిలో డిప్లమో చేసింది. పదేళ్ల ప్రాయం నుంచే నాట్యగురువు సంధ్యామూర్తి వద్ద భరతనాట్యం, కూచిపూడిలో శిక్షణ తీసుకుంది. అనతి కాలంలోనే గుంటూరు, తిరుపతి, హైదరాబాద్, ఏలూరు, చిదంబరం, విశాఖపట్నం తదితర చోట్ల జరిగిన నృత్యపోటీల్లో పాల్గొని అనేక బహుమతులు పొందింది. డెహ్రాడూన్‌లో జరిగిన శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. విశాఖలో జరిగిన యువజనోత్సవాల్లో తృతీయ బహుమతి, 2015లో థాయ్‌లాండ్, 2019లో మలేషియా దేశాల్లో జరిగిన భారతీయ నృత్య ప్రదర్శనల్లో పాల్గొని, అనంత కీర్తిని ఘనంగా చాటింది. తన బృందంతో నెహ్రూయువ కేంద్ర ద్వారా ఈనెల 13న గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.

ఎన్‌వైకే పోటీల్లో ప్రతిభ చూపుతాం



నాతోపాటు నా బృందం నాట్యాచార్యులు సంధ్యామూర్తి వద్ద శిక్షణ పొందాం. శాస్త్రీయ నృత్యంలో ప్రత్యేక మెలకువలు నేర్చుకున్నాం. మేమంతా సుశిక్షణతో అనేక పోటీల్లో పాల్గొన్నాం. నెహ్రూ యువకేంద్రం వారు నిర్వహిస్తున్న జాతీయ పోటీల్లో పాల్గొని గెలుపొందుతామన్న విశ్వాసం ఉంది. మేము ప్రదర్శించే 'మహిషాసుర మర్దిని ' నృత్య రూపకం ఎంతో మందిని ఆకట్టుకుంది. మా బృందాన్ని మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. అందరి ఆశీర్వాదంతో మేము జాతీయ స్థాయిలో రాణించాలని లక్ష్యం పెట్టుకున్నాం.

– దివ్యశ్రీ , నాట్య కళాకారిణి

బత్తలపల్లి, శ్రీశైలం జట్ల గెలుపు



మ్యాచ్‌లను ప్రారంభిస్తున్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు

అనంతపురం: ఆర్డీటీ ఉద్యోగుల మధ్య నిర్వహించిన క్రికెట్ టోర్నీలో నాల్గో రౌండ్ మ్యాచ్‌ల్లో బత్తలపల్లి ఆస్పత్రి , శ్రీశైలం ప్రాంత ఉద్యోగుల జట్లు గెలుపొందాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, హౌసింగ్ డీఈ కృష్ణారావు, ఆర్డీటీ టోర్నీ నిర్వాహకులు బీవై నాగప్ప తదితరులు ప్రారంభించారు.

రేడియోగ్రాఫర్స్ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం క్రైం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న రేడియోగ్రాఫర్స్ సమస్యలు పరిష్కరించాలని అమరావతి రేడియాలజీ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ రేడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీకే శివశంకర్ బాబు, కార్యదర్శి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఐఎంఏ హాల్‌లో రాయలసీమ రీజియన్ రేడియోగ్రాఫర్స్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి సీహెచ్ మార్కండేయులు, జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, కార్యదర్శి శివప్రసాద్, నాయకులు రాంప్రసాద్, చంటి, బాలాజీ, నరసింహులు, విశ్వమూర్తి, సునీల్, రామకృష్ణారెడ్డి, సత్యాంజనేయులు, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి అండగా ఉంటాం



కుంపటి నాగరాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కాకర్యకర్త కుంపటి నాగరాజు కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం కుంపటి నాగరాజు కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం గ్రామంలో పర్యటించి, నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే నాగరాజు మృతి చెందడం బాధాకరమని తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, ఉపసర్పంచ్ కేపీ ఓబులేసు, ఎంపీటీసీ రేవతి పెద్దప్ప, నాయకులు వెంకటప్ప, హోతూరు సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ వాణీమోహన్‌కు స్వాగతం పలుకుతున్న కోచ్‌లు

అనంతపురం: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని క్రీడాప్రాధికార సంస్థ, ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జి. వాణీమోహన్ అన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం అక్టోబర్ 2 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నగరంలోని ఇండోర్ స్టేడియాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదివారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయం, మండల స్థాయి, నియోజకవర్గ , జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి క్రీడాకారులను సంసిద్ధం చేయాలన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలను అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగా నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు బహుమతులు, ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి అధికారిని కోల్పోయాం

అనంతపురం టౌన్: జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణంను కోల్పోవడం బాధాకరమని సబ్ రిజిస్ట్రార్ల సంఘం అధ్యక్షుడు షామీర్, కార్యదర్శి బసవరాజు అన్నారు. ఆదివారం ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నాగభూషణం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నాగభూషణం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విధుల పట్ల అంకిత భావంతో పని చేస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించేవారన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులకు నిత్యం అందుబాటులో ఉండే జిల్లా రిజిస్ట్రార్ భౌతికంగా మన మధ్యలేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు కళ్యాణ చక్రవర్తి, నరసింహమూర్తి, షరీఫ్, వెంకట నాయుడు, ఇస్మాయిల్, రాధ రమణ, గురుమూర్తి, హనుమేష్ నాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గద్దర్ జీవితం స్ఫూర్తిదాయకం

అనంతపురం కల్చరల్: నిద్రాణమైన జాతిని తన గీతాలతో మేల్కొలిపిన ప్రజాగాయకుడు గద్దర్ మరణం తీరని లోటని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఈ మేరకు అభ్యుదయ రచయితల సంఘం తరపున ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, విరసం మాజీ సభ్యులు జెట్టి జైరాం, శశికళ తదితరులు గద్దర్ మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతతో ఆయనకు అనేక సంబంధాలు ఉన్నాయని, పలుమార్లు ఎస్కేయూకు, రామగిరి మండలం వెంకటాపురం వచ్చి వెళ్లారని గుర్తు చేసుకున్నారు. 1991లో విప్లవ రచయితల సంఘం నిర్వహించిన సభలో ఆయన పాల్గొని ఇక్కడి వారిలో రగిలించిన పోరాట స్ఫూర్తిని కొనియాడారు.

గద్దర్ లేని లోటు పూడ్చలేనిది

అనంతపురం శ్రీ కంఠం సర్కిల్: ప్రజాగాయకుడు, విప్లవయోధుడు గద్దర్ మృతి విప్లవోద్యమానికి, దళితోద్యమానికి తీరని లోటని సామాజిక న్యాయ ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్, ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ఉద్యమ పాటలంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ, దేశ వ్యాప్తంగానూ గద్దర్ గుర్తుకొస్తారన్నారు.

ప్రశ్నించే గళం మూగబోయింది

అనంతపురం కల్చరల్: ప్రశ్నించే పాట మూగబోయిందని మహాబోధి సాహిత్య వేదిక అధ్యక్షుడు దాసన్నగారి కృష్ణమూర్తి అన్నారు. గద్దర్ మృతికి సంతాపం ఆయన తెలియజేశారు. అనంత ప్రజా గాయకుడు లెనిన్ ఓ ప్రకటనలో గద్దర్ కలం, గళంతో పీడిత ప్రజలకు ఊతమై నిలిచా దరన్నారు.

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం



ముస్లింలతో మేయర్ వసీం

అనంతపురం సిటీ: మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. నగరంలోని లెక్చరర్స్ కాలనీలోని అబూ హురేరా మసీదులో ఆదివారం నిర్వహించిన మహేనా - జోడ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముస్లింలతో ప్రత్యేకంగా చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, లాలూ, ఎంపీటీసీ –2 అంజీ, ఉపసర్పంచ్ మసూద్, పార్టీ నాయకులు హుస్సేన్ మేరేజ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కుర్లపల్లిలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్ల స్వాములు

కనగానపల్లి:మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రజలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేపకుంట, కుర్లపల్లి, భానుకోట గ్రామాల్లో జరిగిన జలధి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి, అగ్నిగుండ ప్రవేశం చేయించారు. తర్వాతా గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తూ పీర్ల స్వాములను జలధి బావికి తరలించారు.

కుంటిమద్దిలో జలధి

రామగిరి: మండలంలోని కుంటిమద్దిలో ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామ వీధుల గుండా పీర్లను మేళతాళాలు, తప్పెట్లతో ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు.

వైభవంగా సుదర్శన హోమం




దత్త మందిరంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: అధిక శ్రావణమాసంలో విశేష ఫలాన్నిచ్చే సుదర్శన హోమం ఆదివారం ఘనంగా జరిగింది. వందల సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయ స్వామి ఆలయం కిటకిటలాడింది. మఠం మేనేజర్ అప్పా సుధీర్ నేతృత్వంలో అర్చకులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేయించారు. ఆలయంలో కొలువైన దత్తాత్రేయుడికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు జరిగాయి. అనంతరం అన్నప్రసాద వితరణ, తీర్థప్రసాద వినియోగం జరిగాయి.

నేడు స్పందన

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్ రమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ సచివాలయంలో స్పందన జరుగుతుందన్నారు.

కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈనెల 9న చేపట్టిన మహాపడావ్ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బళ్లారి రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, నాగేంద్రకుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులు కాలరాస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా తీసుకురావడం దుర్మార్గపు చర్య అన్నారు. మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేసే బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నాయకులు కృష్ణుడు, శ్రీనివాసులు, రాజు, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకటనారాయణ, శ్రీనివాసులు, తిరుమలేసు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎస్ఐ పోస్టుల్లో కానిస్టేబుల్ ప్రతిభ



నరేష్ యాదవ్ (ఫైల్)

తాడిపత్రి: పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్పెషల్‌పార్టీ కానిస్టేబుల్‌గా పనిచేసే నరేష్‌యాదవ్ (2020 బ్యాచ్) తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం ప్రకటించిన ఎస్ఐ పోస్టుల పరీక్ష ఫలితాల్లో 5వ ర్యాంకు సాధించాడు. తాడిపత్రి మండలం యర్రగుంటపల్లికి చెందిన లక్ష్మీనారాయణమ్మ, శ్రీరాములు దంపతుల కుమారుడు నరేష్‌యాదవ్ ఏడు నెలల క్రితం తెలంగాణ రాష్ట్రం ఎస్ఐ పోస్టులకు నిర్వహించిన పోటీ పరీక్ష రాశాడు. అందులో ప్రకటించిన ఫలితాల్లో నాన్ లోకల్ కోటా కింద రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించి, జోన్ – 6 చార్మినార్ ప్రాంతంలో ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్రచికిత్సలు

అనంతపురం కల్చరల్: నగరంలోని లయన్స్‌క్లబ్ అనంతపురం మెయిన్ వారి ఆధ్వర్యంలో గిల్డ్ ఆఫ్ సర్వీసు ప్రాంగణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. అర్బన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, నిర్వాహకులు కంబదూరు నబీరసూల్, ఆసీఫుద్దీన్, లక్ష్మీనారాయణ మాట్లాడారు. 500 మందికి కంటి పరీక్షలు, మందులతో పాటు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు.

అతి పురాతనం..దక్షిణామూర్తి ఆలయం



ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

- ఆశ్చర్యం కలిగించే గుహల రహస్యాలు

అనంతపురం కల్చరల్: నగరం నుంచి బుక్కరాయసముద్రం వెళ్లే దారిలో పాతూరు చెరువుకట్టకు దిగువ భాగంలో వెలసిన దక్షిణామూర్తి ఆలయానికి దాదాపు 600 ఏళ్ల చరిత్ర ఉంది. అద్భుత గుహల రహస్యాలున్న అరుదైన పుణ్యక్షేత్రం శిథిలావస్థకు చేరుకుంటోంది. ఘనమైన చరిత్ర కలిగిన ఆలయ ప్రాభవం క్షణముందే కరిగిపోతూ వీధికుక్కలు, తాగుబోతులకు స్థావరమైంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. దీంతో ఆలయ ప్రభ తగ్గిపోతోందని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనంత నగరం ఏర్పడిన తొలిరోజుల్లో నిర్మాణమైన దక్షిణామూర్తి ఆలయానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. విజయనగర రాజుల కాలంలో మహాశివుడికి ప్రతిరూపంగా నిర్మించిన ఈ ఆలయంలో గార్గేయ మహర్షి రహస్య మార్గం ఏర్పాటు చేసుకొని ధ్యానం చేసేవాడని ప్రతీతి. ఆ గుహ నేరుగా గుత్తి కోట వరకు ఉండేదని కొందరంటుంటే.. దేవరకొండకు, శింగనమల సమీపంలోని గంపమల్లయ్య కొండ వరకు మార్గం ఉండేదని పూజారులు చెప్తున్నారు. ఈ రహస్య గుహల్లో తపస్సు చేసుకునే మార్గానికే గురుస్థానమని, అదే గవిమఠంగా నామాంతరం చెందిందనేది నానుడి.



దక్షిణామూర్తి ఆలయం

ఇక్కడి కోనేరులోని నీరు నారికేళ జలంలా తియ్యగా ఉండేదని, పురాతన ఆలయంలో అడుగు పెడితే ఆదిదేవుడైన దక్షిణామూర్తి దర్శనంతో మానసికానందం కలుగుతుందని భక్తులు చెప్తారు. కాలక్రమంలో ఆలయ మాన్యం కూడా అన్యాక్రాంతమైంది. ఆదాయముంటే తప్ప పట్టించుకోని దేవదాయశాఖ దీని వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

ఆలయానికి పూర్వ వైభవం తీసుకురండి

మేము వైఎస్సార్ జిల్లా నుంచి 16 ఏళ్ల కిందట ఇక్కడికొచ్చి, ఆలయంలో పూజలు చేసుకుంటూ ఇక్కడే ఉండిపోయామని ఆలయ పూజారులు చెప్తున్నారు. యాగంటి అని మరొకరు కూడా పూజలు చేస్తున్నారన్నారు. గవి దక్షిణామూర్తి ఆలయం ఎంతో మహిమాన్వితం. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది. ఆలయ ఆస్తులన్నీ అన్యాక్రాంతమయ్యాయని, ఆలయం కాలగర్భంలో కలిసిపోకుండా పూర్వ వైభవం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.